సాక్షి ఖమ్మం

శనివారం । 4 । మే । 2024



ఇంటి 'ఓటు' పడింది!

వయోవృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్ ప్రక్రియ ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో శుక్రవారం ప్రారంభమైంది. IIలో



బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే...

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే కాంగ్రెస్ మెడలు వంచుతామని ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ తెలిపారు. IIలో

గరిష్టం / కనిష్టం 43° / 29°

వాతావరణం

జిల్లాలో శనివారం గరిష్టస్థాయి ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఎండకు తోడు వడగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శని, ఆదివారాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం ఉదయం బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుండి సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి హెలీకాప్టర్‌లో బయలుదేరనున్న ఆయన 10.45 గంటలకు కొత్తగూడెం చేరుకుంటారు. అక్కడ ఉదయం 11.00 నుండి సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి రోడ్‌షో, బహిరంగసభల్లో పాల్గొంటారు. ఆతర్వాత భట్టి సత్తుపల్లికి చేరుకుని స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు హాజరవుతారు. ఆతర్వాత ఖమ్మం వచ్చి బస చేస్తారు. ఇక ఆదివారం బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాల్లో జరిగే కార్యక్రమాల్లో భట్టి విక్రమార్క పాల్గొంటారు.

'నీట్' నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

ఖమ్మం సహకారనగర్: మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించనున్న నీట్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయని పరీక్షల జిల్లా కోఆర్డినేటర్ ఆర్.పార్వతీరెడ్డి తెలిపారు. ఆమె శుక్రవారం పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటిండెంట్లతో సమావేశమై మాట్లాడారు. ఖమ్మంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్, ఎస్‌వీఎం సెంట్రల్ పబ్లిక్ స్కూల్, ఎస్‌ఈఎస్‌వీవీ సెంట్రల్ పబ్లిక్ స్కూల్, మ్యాక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌తో పాటు బ్లూమింగ్‌మైండ్ సెంట్రల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈమేరకు కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బంది ఎదురుకాకుండా చూడాలని, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించడంతో పాటు తాగునీటి వసతి, జామర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

మొబైల్ కోర్టు జడ్జిగా నాగలక్ష్మి



బక్కెర నాగలక్ష్మి

ఖమ్మం లీగల్: ఖమ్మం సంచార న్యాయస్థానం న్యాయమూర్తిగా నియమితులైన బక్కెర నాగలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హన్మకొండకు చెందిన ఆమె కాకతీయ, ఉస్మానియా యూనివర్సిటీల్లో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశారు. 2014లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించగా, 2023లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడంతో మొదటి పోస్టింగ్ ఖమ్మంలో వచ్చింది. ఆమె ఇద్దరు సోదరులు న్యాయవాదులు కాగా, మరో సోదరుడు ఏపీపీగా విధులు నిర్వర్తిస్తున్నారు. పెండింగ్ కేసుల పరిష్కారంతోపాటు కక్షిదారులకు సత్వర న్యాయం అందించేలా కృషి చేస్తానని నాగలక్ష్మి ఈ సందర్భంగా తెలిపారు.

నేడు హస్తం శంఖారావం



కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సిద్ధమైన సభావేదిక

- 'గూడెం' ప్రచార సభలో పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ముఖ్యమంత్రి అయ్యాక రెండోసారి జిల్లాకు..
- ఎన్నికల కోడ్‌కు ముందు భద్రాచలం, మణుగూరులో పర్యటన
- లోక్‌సభ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ నేడు కొత్తగూడెంలో సభ
- ప్రకాశం స్టేడియంలో పూర్తయిన ఏర్పాట్లు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం కొత్తగూడెం రానున్నారు. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల అభ్యర్థులు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్ విజయాన్ని కాంక్షిస్తూ ప్రకాశం స్టేడియంలో నిర్వహిస్తున్న జనజాతర సభలో సీఎం ప్రసంగించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి భద్రాచలం, మణుగూరులో జరిగిన కార్యక్రమాలకు సీఎం హాజరయ్యారు. ఇప్పుడు రెండోసారి ఎన్నికల ప్రచారానికి వస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో ఉదయం 10.45 గంటలకు కొత్తగూడెం ప్రగతిమైదాన్‌కు చేరుకుని, 11 గంటలకు ప్రకాశం స్టేడియంలో జరిగే సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అభ్యర్థులు, ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొంటారు.

కోడ్ రాకముందే ప్రచారం

ఎన్నికల కోడ్ రాకముందే సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో ప్రచార శంఖారావం పూరించారు. మార్చి 11న భద్రాచలంలో అధికారికంగా పర్యటించిన అనంతరం మణుగూరులో పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాదీవెన సభకు హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజనులకు పోడు హక్కు పత్రాలు, ఉమ్మడి జిల్లా అభివృద్ధి జరిగిందని, పార్లమెంట్‌కు పార్టీ అభ్యర్థులను పంపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని సీఎం పేర్కొన్నారు. అప్పటికే మహబూబాబాద్ అభ్యర్థిగా పోరిక బలరాంనాయక్‌ను ప్రకటించగా.. ఆ తర్వాత ఖమ్మం అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డి ఖరారయ్యారు.

ఆఖరి మోఖా..

కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ఉమ్మడి జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రేణుకాచౌదరి ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇక కొత్తగూడెంలో శనివారం జరిగే సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారు. ఈ సభలో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునివ్వనుండగా.. అగ్రనేతల పరంగా ఇదే చివరి కార్యక్రమమని పార్టీ నేతలు చెబుతున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు

సభకు ఏర్పాట్లు పూర్తి

కొత్తగూడెం రూరల్: కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో శనివారం జరగనున్న జనజాతర సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి భారీగా జనసమీకరణ చేస్తున్నారు. సభ కోసం ప్రకాశం స్టేడియంలో స్టేజీ, స్వాగత ద్వారాల నిర్మాణం, ఫ్లెక్సీల ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. దాదాపు 20 వేల మందికి సరిపడేలా కుర్చీలు, టెంట్లు ఏర్పాటు చేశారు. జర్మనీ టెంట్లతో వేదిక నిర్మించగా.. ఎండల తీవ్రత దృష్ట్యా దాదాపు 200 వరకు భారీ కూలర్లు తెప్పించారు. కాగా, సభ ఏర్పాట్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, రాందాస్‌నాయక్ పరిశీలించారు.



భద్రతా ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

500 మంది పోలీసులతో బందోబస్తు

కొత్తగూడెం టౌన్: లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం శనివారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగే సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు కానుండగా భద్రతా ఏర్పాట్లపై పోలీసులు దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజ్ ఉద్యోగులతో కలిసి స్టేడియాన్ని పరిశీలించి సూచనలు చేశారు. అలాగే, హెలీప్యాడ్ వద్ద కూడా పరిశీలించారు. ఏఎస్పీ టి.సాయిమనోహర్, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ట్రెయినీ ఐపీఎస్ విక్రాంత్, సీఐలు కరుణాకర్, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

రెండింటినీ 'చే'జిక్కించుకునేలా..

అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని భద్రాచలం మినహా ఎనిమిది స్థానాలను కాంగ్రెస్, ఒక స్థానాన్ని సీపీఐ గెలుచుకున్నాయి. భద్రాచలంలో బీఆర్‌ఎస్ గెలిచినా.. ఆ తర్వాత ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు ఖమ్మం పార్లమెంట్ పరిధిలో, మూడు నియోజకవర్గాలు మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్నాయి. ఖమ్మం లోక్‌సభ పరిధి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్, ఒక చోట సీపీఐ ఎమ్మెల్యేలు ఉండగా.. పినపాక, ఇల్లెందుతోపాటు భద్రాచలం ఎమ్మెల్యే చేరికతో మహబూబాబాద్ పరిధిలోని మూడు స్థానాలు కూడా హస్తం ఖాతాలోనే ఉన్నాయి. ఇక లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. రెండింటికీ ఖమ్మం జిల్లా మంత్రులే ఇన్‌చార్జ్‌లుగా ఉండడంతో రెండు చోట్ల లోక్‌సభ ఎన్నికల్లోనూ హస్తం హవా కొనసాగించాలని కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంతో పనిచేస్తున్నాయి. కాగా, గత పార్లమెంట్ ఎన్నికల్లో ఈ రెండు స్థానాలను బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. కానీ ఈసారి ఎమ్మెల్యేల పరంగా రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలోనూ కాంగ్రెస్‌కు బలం ఉండడంతో గెలుపు తమదేనన్న ధీమా హస్తం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

ముగ్గురు మంత్రులం ఉన్నాం..



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన మంత్రి పొంగులేటి, అభ్యర్థి రఘురాంరెడ్డి తదితరులు

- జిల్లాను అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతాం..
- ఖమ్మం నియోజకవర్గానికి ఆరువేల ఇళ్లు
- రోడ్డుషోలో మంత్రులు పొంగులేటి, తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: గత ఎన్నికల్లో తమను కడుపులో పెట్టుకుని అత్యధిక మెజార్టీతో గెలిపించగా ముగ్గురికి మంత్రి పదవులు దక్కడంతో ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తున్నామని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మంలోని జెడ్పీ సెంటర్ నుండి ముస్తఫానగర్, చర్చికాంపౌండ్, ప్రకాష్‌నగర్, బోసుబొమ్మ సెంటర్ మీదుగా గాంధీచౌక్ వరకు శుక్రవారం రాత్రి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చికాంపౌండ్ సెంటర్‌లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ బీఆర్‌ఎస్, బీజేపీ ఒకటేనని, ఆ రెండు పార్టీల నడుమ లోపాయికారి ఒప్పందం ఉందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ తాను చేసిన తప్పుల నుండి కాపాడుకోడానికి బీజేపీతో జత కడుతున్నారని చెప్పారు. ఎన్నో మోసపూరిత హామీలు ఇచ్చి మాయమాటలతో పదేళ్లు రాజ్యమేలారని విమర్శించారు. కనీసం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కూడా ఇవ్వలేకపోయారని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కట్టిస్తామని చెప్పినప్పటికీ మంత్రి తుమ్మల ఖమ్మం నియోజకవర్గానికి అదనంగా ఇళ్లు కావాలని అడిగారని తెలిపారు. గృహనిర్మాణ శాఖకు మంత్రిగా ఉన్న తాను ఖమ్మంకు ఆరు వేల ఇళ్లు మంజూరు చేస్తానని ప్రకటించారు. ఎంపీగా రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే కేంద్రం నుంచి అదనంగా నిధులు వస్తాయని తెలిపారు.

నిరుపేదలందరికీ ఇళ్లు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మంలో రోడ్ల వెంట, కాల్వగట్ల వెంట గుడిసెలు వేసుకుని ఉంటున్న వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. వెంకటగిరి, బైపాస్ బ్రిడ్జిలు, దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్, పుట్టకోట బెడ్ తన హయాంలో నిర్మించినవేనని తెలిపారు. ఖమ్మం ప్రజలు ప్రశాంతంగా అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉండాలంటే రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. జిల్లా నుంచి డిప్యూటీ సీఎం భట్టితో పాటు తామిద్దరం కలిసి ఖమ్మంను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉంచుతామని తెలిపారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని చెబుతున్న వారు ధైర్యం ఉంటే రేవంత్‌రెడ్డిని తాకాలని సూచించారు. మతోన్మాద బీజేపీ మరోమారు గెలిస్తే ప్రజల మధ్య మతవిద్వేషాలను రెచ్చగొట్టి దేశాన్ని విభజిస్తుందని తెలిపారు. అనంతరం అభ్యర్థి రఘురాంరెడ్డి మాట్లాడుతూ తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ముగ్గురు మంత్రుల సమన్వయంతో జిల్లా అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. ఈ రోడ్డు షోలో డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు మహ్మద్ జావీద్, బాలసాని లక్ష్మీనారాయణ, సాధు రమేష్‌రెడ్డి, దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి

ఉద్యోగుల శిక్షణలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఉద్యోగులు ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వర్తించాలని ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాలల్లో అధికారులకు శుక్రవారం ఏర్పాటు చేసిన శిక్షణను ఆయన పరిశీలించి మాట్లాడారు. మాక్ పోలింగ్, ఈవీఎంల పనితీరుపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు.

గైర్హాజరైన వారికి మరోమారు శిక్షణ

ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగుల్లో శిక్షణకు గైర్హాజరైన వారితో పాటు పూర్తి అవగాహన రాని వారికి మరోమారు శిక్షణ ఇవ్వాలని ఆర్‌ఓ, కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. ఎన్నికల విధులు నిర్వర్తించనున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో పోలింగ్ సమయం సాయంత్రం ఆరు గంటల వరకు పొడిగించిన విషయాన్ని ప్రచారం చేయాలని చెప్పారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రతీ ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఖమ్మం, పాలేరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు.



ఉద్యోగుల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

అదనపు ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి

లోకసభ ఎన్నికల్లో అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా సమకూర్చుకున్న అదనపు ఈవీఎంల మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తయిందని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఏఆర్‌ఓలు, పార్టీల అభ్యర్థులు, ప్రతినిధుల సమక్షాన ర్యాండమైజేషన్ పూర్తిచేశామని చెప్పారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, డీపీఓ విజయనిర్మల, డీఆర్వో రాజేశ్వరి, ఆర్డీఓలు జి.గణేష్, ఎల్.రాజేందర్, అదనపు డీసీపీ ప్రసాదరావు, తహసీల్దార్ సీహెచ్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

సుందర మున్నేరే లక్ష్యం..

నిర్మాణ సంస్థ ప్రతినిధులతో మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: మున్నేరు నదీతీరంలో ప్రజలు సేదతీరేలా ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మున్నేరుకు ఇరుపక్కలా రక్షణ గోడ నిర్మించనుండగా.. నిర్మాణ సంస్థ ప్రతినిధులు శుక్రవారం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిర్మాణాల క్రమంలో ఇరువైపులా గృహాలు నిర్మించుకున్న వారికి సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. గోడ నిర్మాణం ప్రారంభమయ్యే గోళ్లపాడు ఆనకట్ట చివరి నుంచి ప్రకాష్‌నగర్ ఆనకట్ట వరకు నిత్యం నీరు నిలిచి ఉండేలా అవసరమైతే చిన్న చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే, ఖమ్మంలో పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా బైపాస్ నుండి ప్రకాష్‌నగర్ బ్రిడ్జి వరకు ప్రొటెక్షన్ వాల్ అనుకుని డబుల్ రోడ్డు నిర్మించాలని తెలిపారు. గోడ నిర్మాణంతో డ్రెయినేజీ సమస్య తలెత్తకుండా కేఎంసీ ఇంజనీర్లతో చర్చించాలని చెప్పారు. అలాగే, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, విద్యుత్, పోలీసుల ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ పనులు చేపట్టాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.



రక్షణ గోడ డిజైన్‌పై సూచనలు చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నిఘా వ్యవస్థ పటిష్టంగా ఉంటేనే నేర నియంత్రణ

పోలీసు కమిషనర్ సునీల్‌దత్

వైరా: నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని.. తద్వారా నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. వైరాలోని ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన వైరా డివిజన్ పోలీసు అధికారులతో సమీక్షించారు. పెండింగ్ కేసులు, దర్యాప్తు తీరు, చార్జిషీట్ల దాఖలుపై ఆరా తీసిన అనంతరం సీపీ మాట్లాడారు. కేసుల దర్యాప్తులో నాణ్యత ఉండేలా చూడాలని, తద్వారా నేరస్తులకు శిక్ష పడుతుందని తెలిపారు. చోరీలను అరికడుతూనే పాత కేసుల్లో సొత్తు రికవరీపై దృష్టి సారించాలని చెప్పారు. విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ బహిరంగ మద్యపానం, రాష్ డ్రైవింగ్, సమయానికి మించి షాపులు తెరిచిన వారిపై సిటీ పోలీసు యాక్టు అమలు చేయాలని సీపీ ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటుచేయాలని తెలిపారు. ఏసీపీలు ఎం.ఏ.రెహమాన్, సాంబరాజు, సీఐలు సాగర్, మధు, ఎస్సైలు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



రోడ్డుషోలో అభివాదం చేస్తున్న తాండ్ర వినోద్‌రావు, పక్కన నాయకులు

ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి వినోద్‌రావు

ఖమ్మం మామిళ్లగూడెం: దేశంలో బీజేపీ అధికారంలోకి రావడంతో పాటు ఇక్కడ కూడా తాను గెలిస్తేనే ఖమ్మం అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం రోడ్‌షో నిర్వహించగా.. రాపర్తినగర్ సెంటర్‌లో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రమైన ఖమ్మంలో కేంద్రం ఇచ్చిన నిధులతోనే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, పార్కులు, రోడ్ల నిర్మాణం జరిగిందని తెలిపారు. గత పదేళ్లుగా ఎంపీగా ఉన్న నామ నాగేశ్వరరావు ఏం సాధించారో చెప్పాలన్నారు. ఇక కాంగ్రెస్ గెలిచినా అదే పరిస్థితి ఉంటుందని చెప్పారు. కేంద్రంలో మూడోసారి కూడా మోదీ నేతృత్వాన ప్రభుత్వం ఏర్పడనున్నందున ఖమ్మం నుంచి తనను గెలిపిస్తే అత్యధిక నిధులు సాధించి అభివృద్ధికి పడుతానని వినోద్‌రావు తెలిపారు. అనంతరం బీజేవైఎం ఆధ్వర్యాన నిర్వహించిన యువజన సదస్సులో వినోద్‌రావు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలకమైన యువత బీజేపీ అభ్యర్థిగా తనకు ఓటు వేసేలా ప్రచా రం చేయాలని కోరారు. అనంతరం మాజీ మంత్రి డాక్టర్ విజయరామారావు మాట్లాడగా... వినోద్‌రావును నాయకులు సత్కరించారు. కాగా, నాయకుడు రుద్ర ప్రదీప్‌తో పాటు 24వ డివిజన్‌కు చెందిన పలువురు నాయకులు తిరిగి బీజేపీలో చేరారు. ఈసందర్భంగా వారికి వినోద్‌రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశాల్లో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు డాక్టర్ గొంగూర వెంకటేశ్వర్లు, డాక్టర్ శీలం పాపారావు, అల్లిక అంజయ్య, మోత్కూరి నారాయణ, వాసుదేవరావు, భద్రం, మేకల నాగేందర్, సుధాకర్, క్రాంతి, మధు, ఉపేందర్‌గౌడ్, శ్రీనివాస్, రవితేజ, నాగసురేందర్‌రెడ్డి, పృథ్వీ, వినయ్, గోపి, నాగాచారి, వెంకట్‌యాదవ్, పరశురాం, లక్ష్మారెడ్డి, గోపి, శ్రీకాంత్, రామకృష్ణ, ప్రవీణ్, అజయ్, కిట్టు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

ఖమ్మంవ్యవసాయం: వేసవిలో విద్యుత్ వినియోగం పెరుగుతుండగా, అంతరాయాలు లేకుండా సరఫరా చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్‌ఈ ఏ.సురేందర్ తెలిపారు. ఖమ్మం మమతా ఆస్పత్రి రోడ్డులోని సబ్ స్టేషన్‌లో రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన అదనపు 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ మేరకు ట్రాన్స్‌ఫార్మర్ పనితీరును పరిశీలించిన ఎస్‌ఈ మాట్లాడుతూ నగరం విస్తరిస్తుండగా పెరుగుతున్న అవసరాల మేరకు సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఏర్పాటుచేసిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా రాఘవయ్యనగర్, గొల్లగూడెం, చెరువుకట్ట బజార్, రోటరీనగర్, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు ఉండవని చెప్పారు. డీఈలు బాబూరావు, నంబూరి రామారావు, భద్రు పవార్, ఏడీఈ రమేష్ పాల్గొన్నారు.



అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఈ సురేందర్

రఘునాథపాలెంలో...

రఘునాథపాలెం: రఘునాథపాలెంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు రూ.4లక్షల వ్యయంతో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు డీఈ ఎస్.రామారావు, ఏడీఈ సంజయ్‌కుమార్ తెలిపారు. గ్రామంలోని గాంధీ బొమ్మ సెంటర్, ఎస్సీ కాలనీల్లో అంతరాయాలు నివారించడానికి ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేశామని చెప్పారు. ఏఈ ఇందిర, ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాకేష్‌రెడ్డి

ప్రకటించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా హనుమకొండకు చెందిన ఏనుగుల రాకేష్‌రెడ్డిని బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించారు. ఈమేరకు గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన రాకేష్‌రెడ్డి సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. బిట్స్ పిలానిలో మాస్టర్స్ ఇన్ మేనేజ్‌మెంట్ స్టడీస్(ఎంఎంఎస్), మాస్టర్స్ ఇన్ ఫైనాన్స్(ఎంఎస్) పూర్తి చేసిన ఆయన సిటీ బ్యాంక్ మేనేజర్‌గా, జేపీ మోర్గాన్, ఫేస్‌బుక్‌లాంటి పలు అంతర్జాతీయ కార్పొరేట్ కంపెనీల్లో బెంగళూరు, అమెరికాలో ఏడేళ్ల పాటు ఉన్నతస్థాయిలో ఉద్యోగాలు చేశారు.



రాకేష్‌రెడ్డి

ఆపై రాజకీయాలపై ఆసక్తితో 2013లో బీజేపీ ద్వారా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. అంచెలంచెలుగా ఎదుగుతూ బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా, రెండు పర్యాయాలు రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు. బీజేపీ నుంచి వరంగల్ పశ్చిమ టికెట్ ఆశించిన రాకేష్‌రెడ్డి వరంగల్ కేంద్రంగా ఆధ్యాత్మిక, సామాజిక, సేవా కార్యక్రమాలు చేపట్టారు. కానీ గత ఏడాది ఎన్నికల్లో టికెట్ రాకపోవడంతో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు యువత, విద్యావంతులతో మంచి సంబంధాలు ఉన్నాయని భావించిన కేసీఆర్.. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించారు.

ఐదుగురి నామినేషన్లు

నల్లగొండ: నల్లగొండ – వరంగల్ – ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి శుక్రవారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థులుగా మాధవపెద్ది వెంకట్‌రెడ్డి ఒక సెట్, చంద్రశేఖర్ రెండు సెట్లు నామినేషన్ పత్రాలను నల్లగొండ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందజేశారు. అలాగే, అలియన్స్ డెమొక్రటిక్ రీఫామ్స్ పార్టీ అభ్యర్థి ఈడ శేషగిరిరావు, తెలంగాణ సకల జనుల పార్టీ అభ్యర్థి నందిపాటి జానయ్య ఒక్కో సెట్ సమర్పించారు.



నామినేషన్ సమర్పిస్తున్న తీన్మార్ మల్లన్న, పక్కన మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో పరిశీలకుడి తనిఖీ



వల్లబి చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలపై ఆరా తీస్తున్న సంజయ్

ముదిగొండ/బోనకల్: ముదిగొండ మండలంలోని న్యూలక్ష్మీపురం, కమలాపురం, బాణాపురం, వల్లబి, గంధసిరి, వల్లాపురం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ సాధారణ పరిశీలకుడు డాక్టర్ సంజయ్ జి.కోల్టే శుక్రవారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో వసతులపై ఆరా తీసిన ఆయన తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు మెరుగుపరచాలని సూచించారు. ఆతర్వాత వల్లబిలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీ రికార్డులను పరిశీలించారు. అలాగే, బోనకల్ మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సైతం సంజయ్ తనిఖీ చేసి ఉద్యోగులకు సూచనలు చేశారు. తహసీల్దార్లు రామారావు, పున్నంచందర్, ఎంపీడీఓ ఎల్.రాజు, ఎంపీఓలు సూర్యనారాయణ, శాస్త్రి, ఉద్యోగులు ఉషారాణి, సాంబశివరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

‘నీట్’ రాయనున్న డీఎంఏ అధ్యాపకులు



నీట్ రాయనున్న అధ్యాపకులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని డాక్టర్స్ మెడికల్ అకాడమీ(డీఎంఏ)కి చెందిన నలుగురు అధ్యాపకులు నీట్ రాయనున్నారని అకాడమీ బాధ్యులు తెలిపారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బాటనీ అధ్యాపకులు రాయల సతీష్‌బాబు, ఈగా భరణికుమార్, అన్వేష్, ఉదయ్‌కుమార్ శుక్రవారం మాట్లాడుతూ ఎంబీబీఎస్ చదవాలనుకునే విద్యార్థులు అవగాహన లేక లక్ష్యాన్ని చేరలేకపోతున్నారని తెలిపారు. ఈమేరకు తాము పరీక్ష రాసి స్వీయ అనుభవంతో విద్యార్థులకు బోధించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

426 మంది విద్యుత్ సిబ్బందికి శిక్షణ

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సిబ్బందికి నైపుణ్యాల పెంపు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ఇస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. జిల్లాలోని వివిధ సెక్షన్లలో విధులు నిర్వర్తిస్తున్న 426 మంది ఉద్యోగులకు గతనెల 19నుంచి విడతల వారీగా శిక్షణ ఇచ్చారు. ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్ పర్యవేక్షణలో వరంగల్ ఎన్పీడీసీఎల్‌కు చెందిన నిపుణులు తరగతులు నిర్వహించగా.. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముగింపు సమావేశంలో ఎస్ఈ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాటిస్తూ జిల్లాను ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలని సూచించారు.


బోదులబండలో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న స్థానికులు

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండలో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామంలో రైతు వేముల బాబుకు చెందిన వరిగడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో దాదాపు 150 వరిగడ్డి దిండ్లు కాలిపోతుండగా, స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నాలు చేశారు. అయినా సాధ్యం కాకపోవడంతో అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం ఇవ్వగా సిబ్బంది చేరుకుని స్థానికుల సమన్వయంతో మంటలను అదుపు చేశారు. ఇళ్ల మధ్య మంటలు చెలరేగగా సమయానికి ఆర్పడంతో ప్రమాదం తప్పినట్లయింది.


టన్ను చేపలు మృత్యువాత



బైరవునిపల్లి చెరువులో చనిపోయిన చేపలు

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి చెరువులో దాదాపు టన్ను మేర చేపలు మృతి చెందాయి. చెరువులో నీరు అడుగంటడంతో సరిపడా ఆక్సిజన్ అందక చేపలు చనిపోతున్నాయి. గ్రామంలోని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సభ్యుల నడుమ వివాదంతో చేపల వేట ఆలస్యమైంది. మరోపక్క ఎండ పెరిగి నీరు తగ్గుతుండడంతో చెరువులో చేపలు చనిపోయి తేలుతున్నాయి. ఇప్పటి వరకు దాదాపు టన్ను వరకు చేపలు చనిపోవడంతో రూ.లక్ష మేర నష్టం ఎదురైందని సొసైటీ అధ్యక్షుడు మల్లెబోయిన సైదులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,229

ఇంటి ‘ఓటు’ పడింది !

- లోక్‌సభ పరిధిలో హోం ఓటింగ్ ప్రారంభం
- వయోవృద్ధులు, దివ్యాంగులకు అవకాశం
- ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో 2,169 మంది ఓటర్లు



వైరా నుంచి హోం ఓటింగ్‌కు బయలుదేరుతున్న ఉద్యోగులతో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

సత్తుపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్‌కు సంబంధించి తొలిఘట్టం ప్రారంభమైంది. ఈనెల 13న పోలింగ్ జరగాల్సి ఉన్నా... వంద శాతం ఓటింగ్ లక్ష్యంగా కేంద్రం ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంతో శుక్రవారమే తొలి ఓటు పడింది. 2021 ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన హోం ఓటింగ్ సత్ఫలితాలను ఇవ్వడంతో గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లోనూ అమలుచేశారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లోనూ 81ఏళ్లు దాటిన వయోవృద్ధులు, సదరం సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు. ఎన్నికల అధికారుల బృందం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి ధృవీకరించుకున్నాక అర్హులను గుర్తించారు.

పోలింగ్ ప్రారంభం

ఖమ్మం లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల జోనల్ ఆఫీసర్ పర్యవేక్షణలో హోం ఓటింగ్ చేపట్టారు. ఇంటి నుంచి ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎంపికైన వారు 2,169 మంది ఉండగా.. ఒకొక్కరికి రెండు సార్లు అవకాశం ఇస్తారు. ముందుగానే ఏ రోజు వచ్చేది ఓటరుతో పాటు పార్టీల ప్రతినిధులకు సమాచారం ఇస్తారు. ఓసారి ఓటు వేసేందుకు వీలు కాకపోతే రెండో సారి కూడా అవకాశం ఉంటుంది. రెండు సార్లు కూడా ఓటుహక్కు వినియోగించుకోకపోతే ఇక వారు అర్హత కోల్పోతారు. వీరికి సాధారణ పోలింగ్ రోజున కూడా ఓటుహక్కు వినియోగించుకోవడానికి వీలుండదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

ప్రత్యేక బృందాలతో పోలింగ్

సెక్టోరియల్ అధికారి, ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, వీడియో గ్రాఫర్, బూత్ లెవల్ అధికారి, మైక్రో అబ్జర్వర్లతో కూడిన బృందాలు పోలీస్ బలగాల పహారా మధ్య హోం ఓటింగ్‌ను పర్యవేక్షిస్తారు. అర్హుల నుంచి అవసరమైన పత్రాలు తీసుకుని బ్యాలెట్ పేపర్‌పై ఓటు వేయించాక కవర్‌లో పెట్టి సీల్ వేసి ఓటరుతోనే బ్యాలెట్ పెట్టెలో వేయిస్తారు. కాగా, శుక్రవారం మొదలైన హోం ఓటింగ్ మరో రెండు, మూడు రోజులు కొనసాగనుంది.

హోం ఓటింగ్‌కు ఎంపికైన ఓటర్లు

నియోజకవర్గం	ఓటర్లు
ఖమ్మం	349
సత్తుపల్లి	481
వైరా	297
మధిర	407
అశ్వారావుపేట	172
పాలేరు	299
కొత్తగూడెం	164
మొత్తం	2,169

హోమ్ ఓటింగ్‌ను ప్రారంభించిన అదనపు కలెక్టర్

వైరా: దివ్యాంగులు, వయోవృద్ధుల హోం ఓటింగ్‌ను శుక్రవారం వైరాలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ ప్రారంభించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు ఏడు ఏడు బృందాలను ఏర్పాటుచేయగా.. ఉద్యోగులు ఎన్నికల సామగ్రితో వెళ్లారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా ప్రతిఒక్కరూ ఓటుహక్కు సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో వృద్ధుడితో ఓటు వేయిస్తున్న ఎన్నికల అధికారులు

మత విద్వేషాలతో లబ్ధికి బీజేపీ కుట్ర

- కాంగ్రెస్ మాత్రం అన్నివర్గాలను సమంగా చూస్తుంది..
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- కాంగ్రెస్‌లో చేరిన మేయర్ నీరజ



మేయర్ నీరజకు కాంగ్రెస్ కండువా కప్పుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, పక్కన మంత్రి తుమ్మల తదితరులు

ఖమ్మంవన్‌టౌన్: మత విద్వేషాలను రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ధి పొందాలని బీజేపీ చూస్తోందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మేయర్ నీరజతో పాటు కార్పొరేటర్లు కొత్తపల్లి నీరజ, సరిపూడి రమాదేవి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి డీసీసీ అధ్యక్షుడు కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఉత్తర భారతదేశంతో పాటు మిగిలిన రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ ముందంజలో ఉందని తెలు స్తోందని చెప్పారు. తద్వారా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కాయమని తెలి పారు. బీజేపీతో పోలిస్తే కాంగ్రెస్ పార్టీ అన్నివర్గాలను సమదృష్టితో చూస్తున్నందున అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే లోక్‌సభ ఎన్నికల్లోనూ రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలిచేలా ప్రజలు మద్దతుగా ఇవ్వాలని కోరారు. త్వరలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూలిపోతుందని చెబుతున్న వారికి బుద్ధి వచ్చేలా ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. కాగా, ఖమ్మంను రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలపాలన్నదే తన లక్ష్యమని, అందుకే నీతి, నిజాయితీతో పాలన సాగిస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. దౌర్జన్యాలు, రౌడీయిజం, అక్రమాలు లేని ఖమ్మం కావాలని తమను గెలిపించిన నేపథ్యాన పాలన అదే తరహాలో కొనసాగుతోందని చెప్పారు. కొత్త, పాత నాయకులు సమన్వయంతో ముందుకుసాగుతూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం మేయర్ నీరజ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటే టీడీపీలో చేరి రాజకీయాలలోకి వచ్చామని గుర్తు చేశారు. అభివృద్ధి ప్రదాత అయిన ఆయనతో కలిసి ఖమ్మం నగరాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. ఈ కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావీద్, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, మిక్కిలినేని నరేందర్, రావూరి సైదుబాబు, తుపాకుల యలగొండలస్వామి పాల్గొన్నారు.

మామ గెలుపు కోసం కోడళ్ల ప్రచారం



అభివాదం చేస్తున్న రఘురాంరెడ్డి కోడళ్లు, కుమారుడు

ముదిగొండ: ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి తరఫున ఆయన కుటుంబీకులు ప్రచారంలో పాలుపంచుకుంటున్నారు. ఈమేరకు ముదిగొండ మండలంలోని కమలాపురం, అయ్యగారిపల్లి, బాణాపురంల్లో శుక్రవారం జరిగిన ప్రచారానికి రఘురాంరెడ్డి కోడళ్లు అశ్రిత(హీరో వెంకటేష్ కుమార్తె), సప్నిరెడ్డి(మంత్రి పొంగులేటి కుమార్తె) పాల్గొన్నారు. అలాగే, రఘురాంరెడ్డి కుమారుడు అర్జున్‌రెడ్డి కూడా హాజరుకాగా పలుచోట్ల ప్రజలను ఉద్దేశించి వారు మాట్లాడారు. ఈసందర్భంగా అశ్రిత, సప్నిరెడ్డి మాట్లాడుతూ సేవాగుణం కలిగిన రఘురాంరెడ్డిని గెలిపించేలా హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అలాగే, ఈనెల 7న ప్రచారానికి హీరో వెంకటేష్ రానున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వనం ప్రదీప్తబాబు, వల్లూరి భద్రారెడ్డి, వాక వెంకటేశ్వరరెడ్డి, మట్టా బాబురాంరెడ్డి, ఆదినారాయణరెడ్డి, పందిరి అంజయ్య, మరికంటి రామయ్య, ఇలవల పుల్లారెడ్డి, వట్టికూటి సైదులుగౌడ్, వీరారెడ్డి పాల్గొన్నారు.

కిడ్నీ మారిస్తేనే జీవితం

- అప్పటి వరకు డయాలసిస్ తప్పనిసరి
- దాతల సాయం కోరుతున్న బాధితుడి తల్లి



బిడ్డను బతికించాలని కోరుతున్న ఝాన్సీ

రఘునాథపాలెం: నిరుపేదలైనా బిడ్డలు ఉన్నతి స్థితికి చేరాలనే ఆశతో రెక్కల కష్టంతో ఉన్నత చదువులు చదివిస్తుండగా.. ఆ తల్లిదండ్రులకు కుమారుడి అనారోగ్యం అశనిపాతంలా మారింది. పెద్ద కుమారుడి రెండు కిడ్నీలు పాడు కావడంతో.. కిడ్నీలు మార్చే వరకు ప్రతీ వారం డయాలసిస్ చేయాలన్న వైద్యులు సూచనతో ఏం చేయాలో పాలుపోక దాతల చేయూత కోసం ఎదురుచూస్తున్నారు. రఘునాథపాలెం మండలం బూడిదంపాడుకు చెందిన కేలోతు ఝాన్సీ – శంకర్ దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు లక్ష్మీగణేష్ ఎంఎస్ చదువుతుండగా.. రెండు కిడ్నీలు చెడిపోయినట్లు వైద్యపరీక్షల్లో తేలింది. కిడ్నీలు మారిస్తేనే బతుకుతాడని వైద్యులు చెప్పడంతో కూలీ పనులతో జీవనం సాగిస్తున్న ఝాన్సీ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇప్పటికే డయాలసిస్ కోసం అప్పు తెచ్చి రూ.6లక్షల వరకు వెచ్చించగా.. బంధువులు కూడా సహకరించారు. కానీ కిడ్నీ మార్పిడి కోసం రూ.40లక్షల వరకు ఖర్చవుతుందని తెలుస్తుండగా, అప్పటి వరకు డయాలసిస్ చేయించేందుకు సైతం చేతిలో చిల్లిగవ్వ లేక ఆ కుటుంబం రోదిస్తోంది. ఈమేరకు తమ కుమరుడికి ప్రాణభిక్ష పెట్టాలని ఝాన్సీ – శంకర్ కోరుతున్నారు.

సాయం చేయాలనుకున్న వారు 73866 56255 నంబర్‌కు ఫోన్‌పే చేయాలని కోరుతున్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపిస్తే కాంగ్రెస్ మెడలు వంచుతాం



మాట్లాడుతున్న అజయ్‌కుమార్, పక్కన ఎంపీ రవిచంద్ర, అభ్యర్థి నామ, ఎమ్మెల్సీ మధు

- ఎంపీ వద్దిరాజు, అభ్యర్థి నామ, మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి, కేసీఆర్‌ను బలపరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి సంక్షేమ పథకాలు అమలు చేయించే బాధ్యత తీసుకుంటామని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో వారు మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో జిల్లా ప్రజలు చరిత్రను తిరగరాయనున్నారని పేర్కొన్నారు. ఖమ్మం నియోజవర్గంలోనే బీఆర్ఎస్‌కు అత్యధిక మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు ఇప్పటికీ ప్రజాదరణ తగ్గలేదని సర్వేల్లో తేలినందున ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ హయాంలో అమలైన పథకాలు, కాంగ్రెస్ హామీలను విస్మరించిన తీరును వివరిస్తూ నామ విజయానికి పాటుపడాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మేయర్ పునుకొల్లు నీరజ, నాయకుడు గుండాల కృష్ణ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నామ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

రఘునాథపాలెం: ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి నామ నాగేశ్వరరావు గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేసి అత్యధిక మెజార్టీ సాధించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధు సూచించారు. రఘునాథపాలెంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలుచేసిన సంక్షేమ పథకాలను ప్రతీ గడపకు వెళ్లి వివరించాలని తెలిపారు. అంతేకాక కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు విస్మరించిన అంశంపై ప్రచారం చేయాలని సూచించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అజ్మీరా వీరూనాయక్, వైస్ ఎంపీపీ గుత్తా రవితో పాటు మద్దినేని వెంకటరమణ, పిన్ని కోటేశ్వరరావు, భూక్యా లక్ష్మణ్‌నాయక్, మెంటం రామారావు, కుతుంబాక నరేష్, బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు పాల్గొన్నారు.

మిత్రపక్ష పార్టీల కోఆర్డినేటర్లు వీరే...

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కోఆర్డినేటర్లను నియమించినట్లు డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గాల వారీగా కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులను నియమించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు నాయకులు కేటాయించిన నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామసమాయం రఘురాంరెడ్డి తరఫున ప్రచారంలో పాల్గొంటారని తెలిపారు. పాలేరు నియోజకవర్గానికి మద్దినేని స్వర్ణకుమారి, బుగ్గవీటి సరళ, దండి సురేష్, ఖమ్మంకు మహ్మద్ జావీద్, ఎర్రా శ్రీకాంత్, జమ్ముల జితేందర్‌రెడ్డి, మధిరకు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పొన్నం వెంకటేశ్వర్లు, జమలేందర్‌రెడ్డి, వైరాకు రాంపూడి రోశయ్య, భూక్యా వీరభద్రం, యర్రా బాబు, సత్తుపల్లికి చల్లగుండ్ల నర్సింహారావు, మాచర్ల భారతి, దండు ఆదినారాయణ, కొత్తగూడెంకు నాగేంద్ర త్రివేది, అన్నవరపు సత్యనారాయణ, షేక్ సాబీర్ పాషా, అశ్వారావుపేటకు జూపల్లి రమేష్, కొక్కురపాటి పుల్లయ్య, సయ్యద్ సలీంను నియమించామని వెల్లడించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కూసుమంచి: కూసుమంచిలో నివాసముంటూ కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న చిరుతగండ్ల మురళీకృష్ణ గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లాడ మండలం వెంగన్నపేటకు చెందిన ఆయన రెండేళ్ల క్రితం కూసుమంచి వచ్చాడు. అయితే, మద్యానికి బానిసైన ఆయ న రోజూ తాగి ఇంటికి వస్తుండగా కుటుంబీకులు మందలించగా క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఘటనపై ఆయన భార్య దుర్గాభవాని శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.


విభజించి, పాలించు అన్నరీతిలో ఆర్టీసీ యాజమాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా యాజమాన్యం కార్మికులతో విభజించు, పాలించు అన్నట్లు వ్యవహరిస్తోందని టీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పాటి అప్పారావు విమర్శించారు. ఖమ్మంలో యూనియన్ సమావేశం డిపో కార్యదర్శి బేతంపూడి బుచ్చిబాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించగా ఆయన మాట్లాడారు. వేతన సవరణకు సంబంధించి 50 శాతం బాండ్ల నగదును సంస్థలోని ఉద్యోగులందరికీ చెల్లించాల్సి ఉందని తెలిపారు.అయితే, కేవలం డ్రైవర్లకు చెల్లించి మిగతా ఉద్యోగుల విషయంలో ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాక ఈనెల 1వ తేదీన డ్రైవర్లు, కండక్టర్లకు మాత్రమే వేతనాలు చెల్లించి మిగిలిన వారిని విస్మరించారని తెలిపారు. ఇలాంటి చర్యలతో సిబ్బందిలో అంకితభావం లోపిస్తుందని చెప్పారు. ఈమేరకు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని నిర్ణయించినట్లు అప్పారావు తెలిపారు. అనంతరం యూనియన్ ఖమ్మం రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్ మాట్లాడగా, నాయకులు రజనీకుమారి, ఆర్ఎస్.నారాయణ, ఎండీ.గౌస్, మొయినుద్దీన్, లాజర్, ప్రదీప్, మదన్మోహన్‌రావు, సుశీల, చలోమి, పద్మావతి, లాజర్, సునీల్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో వివాహిత మృతి



జయమ్మ (ఫైల్)

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లకు చెందిన వివాహిత యు.జయమ్మ (38) జ్వరంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆమెకు ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా కన్నుమూసింది. డెంగీ జ్వరం బారినపడగా, తలలో రక్తం గడ్డకట్టినట్లు పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు చెప్పారని గ్రామస్తులు వెల్లడించారు. ఈవిషయమై మంచుకొండ పీహెచ్‌సీ డాక్టర్ బాలకృష్ణను వివరణ కోరగా నివేదికలు పరిశీలించాక వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి?

హత్యగా భావిస్తున్న పోలీసులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని తుమ్మూరు శివారు అరటి తోటలో కాపలా ఉంటున్న వివాహిత మహిళ అనుమానస్పద స్థితిలో శుక్రవారం మృతి చెందింది. గ్రామంలో తుంబూరు కిషోర్‌రెడ్డికి చెందిన అరటి తోటకు కాపలా ఉండేందుకు ఏపీలోనికై కలూరు మండలం రాచపట్నం గ్రామానికి చెందిన కృష్ణవేణి అలియాస్ లావణ్య(40) తన భర్తతో కలిసి పదిహేను రోజుల క్రితం వచ్చింది. అయితే, ఆమె అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని సమీపంలోని చేపల చెరువులో పనిచేస్తున్న వారు గుర్తించారు. ఈమేరకు వారు ఇచ్చిన సమాచారంతో సీఐ టి.కిరణ్ చేరుకుని పరిశీలించారు. కాగా, పని కోసం దంపతులు వచ్చినా పోలీసులు చేరుకోనేలోగా కృష్ణవేణి భర్త లేకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నీటితొట్టిలో పడి బాలుడు మృతి



నిఖిల్‌సాయి మృతదేహం

పెనుబల్లి: పెనుబల్లి మండలం లంకాసాగర్‌కు చెందిన బాలుడు నీటి తొట్టిలో పడి మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన కిరణ్ – పద్మ దంపతులకు ఇద్దరు సంతానం. రైస్ మిల్లులో పనిచేస్తూ ఆయన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరి చిన్నకుమారుడు నిఖిల్‌సాయి(3) శుక్రవారం మామిడి పండు కడుక్కునేందుకు నీటి తొట్టి వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు అందులో పడ్డాడు. కాసేపటికి కుటుంబీకులు గమనించేసరికే అపస్మారక స్థితిలోకి వెళ్లగా ఆస్పత్రికి తీసుకెళ్లేసరికి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

వడదెబ్బతో వ్యక్తి ...

ఖమ్మంక్రైం: వడదెబ్బ బారిన పడిన గుర్తుతెలియని(45) వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ఖమ్మం గాంధీచౌక్‌లోని రఘు బుక్ సెంటర్ సమీపాన ఓ వ్యక్తి ఎండవేడికి తాళలేక వడదెబ్బకు గురై కన్నుమూశాడు. ఈ విషయమై సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు అన్నం సేవా ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలు...

కామేపల్లి: ఆత్మహత్యయత్నానికి పాల్పడిన మండలంలోని లాల్యతండా గ్రామానికి చెందిన బాదావత్ లక్ష్మి(61) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె జీవితంపై విరక్తితో నాలుగు రోజుల క్రితం ఎలుకల మందు తాగింది. దీంతో లక్ష్మిని కుటుంబీకులు ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. ఘటనపై ఆమె భర్త సోమ్లా శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు...

సత్తుపల్లిరూరల్: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో పాసింజర్ ఆటో గూడ్స్ ఆటో ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. సత్తుపల్లి మండలం మేడిశెట్టివారిపాలెం క్రాస్ వద్ద శుక్రవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం కలగరకు చెందిన కొవ్వూరు తిరుపతిరావు(35) ప్రయాణికుల ఆటోతో అశ్వారావుపేట వైపు నుంచి సత్తుపల్లి వస్తున్నాడు. ఈ ఆటో వెనకాల వేగంగా వచ్చిన మరో సరుకుల ఆటో ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించే క్రమంలో తిరుపతిరావు ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొనగా డ్రైవర్ తిరుపతిరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆయన మృతి చెందాడు.



ఎండలోనుంచి వచ్చిన వెంటనే
చల్లటి నీళ్లు తాగుతున్నారా?

ఎండలో తిరిగి ఇంటికి వచ్చిన వెంటనే ఫ్రిడ్జ్ లోనుంచి బాటిల్ తీసుకుని చల్లని నీళ్లు గటగటా తాగడం చాలా మందికి అలవాటే. విపరీతమైన వేడిలో మన శరీరానికి రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీరు కొంత ఉపశమనం కలిగించేమాట నిజమే అయినా ఇలా చేయడం మంచిది కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు.

ఎండలోనుంచి వచ్చిన వెంటనే చల్లటి నీళ్లు తాగడం వల్ల గొంతు నొప్పి, టాన్సిలైటిస్ సమస్య మాత్రమే కాదు.. జీర్ణక్రియ నుంచి రోగనిరోధక వ్యవస్థ వరకు... చివరకు గుండెపై కూడా తీవ్ర ప్రభావం పడుతుంది.

ఎందుకంటే రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీటిని తాగడం వల్ల రక్తనాళాలు కుచించుకుపోతాయి. అదేవిధంగా ఆహారం తిన్న తర్వాత చల్లటి నీరు తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గిపోయి జీర్ణక్రియలో సమస్యలు తలెత్తుతాయి. దీంతో ఘన ఆహారం సరిగా జీర్ణం కాదు. ఫలితంగా మలబద్ధకం వస్తుంది.

అంతేకాదు, చల్లటి నీటిని తాగడం వల్ల ఈ నాడి చల్లబడుతుంది. ఇది హృదయ స్పందన రేటును తగ్గిస్తుంది. గుండె కొట్టుకునే వేగం ఒక్కసారిగా తగ్గితే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది.

రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీటిని ఎక్కువగా తాగడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఫలితంగా శరీరంలో వివిధ రకాల సమస్యలు సంభవిస్తాయి. చల్లటి నీటిని తాగడం వల్ల శరీరంలో పేరుకుపోయిన కొవ్వు గట్టిపడుతుంది. ఇది బరువు పెరిగేందుకు దారితీస్తుంది.

అందువల్ల వీలయినంత వరకు ఎండలో నుంచి రాగానే చల్లటి నీళ్లు తాగకూడదు. అందులోనూ ఫ్రిజ్‌లోని నీళ్లు తాగడం అసలు మంచిది కాదు. కొంచెంసేపు ఆగిన తర్వాత కుండలోని నీళ్లు లేదా నార్మల్ వాటర్ ముందు తాగి, ఆ తర్వాత చల్లటి నీళ్లు తాగినా ఫరవాలేదు.

మీకు తెలుసా?

మెదడుకు పదును..!

బజారులో నడిచి వెళ్తున్నప్పుడు తెలిసిన వ్యక్తి ఎదురు పడితే వెంటనే పేరు గుర్తురాదు. పలకరింపుగా నవ్వి ఏదో ఒక రకంగా మేనేజ్ చేయాల్సి వస్తుంది. ఇలా తరచూ జరుగుతుంటే మెదడు బద్ధకంగా ఉంటోందని, మతిమరుపు పెరుగుతోందని జాగ్రత్త పడాల్సిందే. వార్ధక్య లక్షణాలను దూరంగా ఉంచడానికి దేహానికి వ్యాయామం చేసినట్లే మెదడు చురుగ్గా ఉండడానికి తగినంత వ్యాయామం కావాలి. రోజూ కనీసం ఒక్క పజిల్‌నైనా పరిష్కరించడం జ్ఞాపకశక్తిని మెరుగు పరుచుకోవడానికి మంచి మార్గం. అలా మెదడును కూడా చురుగ్గా ఉంచినప్పుడే మతిమరుపు అనే వార్ధక్య లక్షణం దూరమవుతుంది. రోజూ ఈ ప్రాక్టీస్ ఉంటే డెబ్బై ఏళ్లు నిండినా సరే జ్ఞాపకశక్తి తగ్గదు. మతిమరుపు దరిచేరదు. దరి చేర్చుకోకూడని మిత్రుడు మతిమరుపు, మెదడు వాడదాం... మెదడును 'వాడి'గా ఉంచుకుందాం.





చక్కెర తగ్గిస్తే కలిగే
ప్రయోజనాలివి

చక్కెర ఉన్న పానీయాలు, స్వీట్లు, ఇతర పదార్థాలను తినడం మానేస్తే శరీరంలోకి అధికంగా చేరే కేలరీల పరిమాణం తగ్గుతుంది. దీని వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. ● చక్కెరను దూరం పెట్టడం వల్ల హైబీపీ, గుండె జబ్బులు సహా ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే ముప్పు తగ్గుతుంది ● నోటి ఆరోగ్యం, దంత సంరక్షణ కోసం చక్కెరను దూరం పెట్టడం చాలా మంచిది. చక్కెరతో కూడిన ఆహార పదార్థాలను దూరం పెడితే నోటి సమస్యలు వచ్చే అవకాశం కూడా తగ్గుతుంది ● చక్కెర తినడం మానేయడం వల్ల టైప్-2 డయాబెటిస్ వచ్చే అవకాశం కూడా చాలా తగ్గుతుంది. మూడ్ స్వింగ్స్, చిరాకు, కోపం తగ్గుతుంది. చర్మం త్వరగా ముడతలు పడటం తగ్గి కాంతిమంతంగా మారుతుంది ● జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కడుపుబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి.

పిల్లల్లో... వ్యాధి నిరోధకత పెంచండిలా!







వేసవి సెలవలు ఇచ్చేశారు. పిల్లలందరూ ఇంటి దగ్గరే ఉంటారు. ఈ సమయంలోనే వారికి వ్యాధినిరోధక శక్తి అంటే ఇమ్యూనిటీ పెరిగే ఆహారాన్ని అందించడం వల్ల స్కూళ్లు తిరిగి తెరిచి, వర్షాలు పడినా కూడా చిన్నా చితకా వ్యాధులు రాకుండా ఉంటాయి. పిల్లలకు ఎలాంటి ఆహారం అందించాలో తెలుసుకుందాం...

సాధారణంగా పోషకాలన్నీ ఉన్న సమీకృత ఆహారం అందించడం వల్ల వ్యాధినిరోధకత పెరుగుతుంది. అందుకు ఏం చేయాలో చూద్దాం...

గుడ్డు: కోడిగుడ్డులో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. పిల్లలకు రోజూ ఒక ఉడికించిన గుడ్డు తినిపించాలి. కండరాలు, చర్మం, గుండె ఆరోగ్యానికి గుడ్డు మంచిది. పిల్లల ఎదుగుదలకు అవసరమైన విటమిన్ ఎ, బి2 (రైబోఫ్లేవిన్) కోడిగుడ్డులో లభిస్తాయి.

ఆకుకూరలు: ఆకుపచ్చటి ఆకుకూరలు, కొత్తిమీర, పాలకూర, ఈ సీజన్‌లో సమృద్ధిగా లభించే మునగకాడలు వంటివి తప్పనిసరిగా పెట్టాలి. వీటిలో ఫైబర్‌తోపాటు ఐరన్, జింక్, మినరల్స్ లభిస్తాయి.

పెరుగు, మజ్జిగ: పెరుగులో ప్రోబయోటిక్స్, విటమిన్ బి12 లభిస్తాయి. ఇది పొట్టలో చెడు బ్యాక్టీరియా వృద్ధి చెందకుండా కాపాడుతుంది. ఇమ్యూనిటీని పెంచుతుంది. కాబట్టి పిల్లలు ఇష్టంగా తినేలా ఫ్రూట్ యోగర్ట్, వెజిటబుల్స్ రైతా, బూందీ రైతా రూపంలో ఇవ్వొచ్చు.

పసుపు: పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుంటాయి. పిల్లలకు రోజూ ఇచ్చే ఆహారంలో చిటికడు పసుపును చేర్చడం వల్ల ఆస్తమా, అలర్జీకి సంబంధించిన సమస్యలు దరిచేరకుండా ఉంటాయి. పాలల్లో పసుపు వేసి తాగించడం అలవాటు చేయవచ్చు.

బాదం, జీడిపప్పు, ఎండుద్రాక్ష, వాల్‌నట్స్, అప్రికాట్స్ వంటివి ఎక్కువగా తినిపించడం వల్ల మెదడు ఎదుగుదలకు అవసరమైన పోషకాలు లభించడంతో పాటు పిల్లల్లో ఇమ్యూనిటీ పెరుగుతుంది.

ఇంకా సీజనల్ ఫ్రూట్స్ అయిన మామిడి, జామ, తాటిముంజలు, సపోటా వంటివి ఇవ్వాలి.

పిల్లలకు స్వీట్స్, పంచదార ఎక్కువగా ఉండే ఇతర పదార్థాలైన ఫ్రూట్‌జ్యూస్‌లు, చాక్లెట్స్, ప్యాకేజ్ స్నాక్స్‌ను ఎక్కువగా తినిపించకూడదు. ఇవి ఇమ్యూనిటీని తగ్గిస్తాయి. ముఖ్యంగా పిల్లలు రోజూ తగినంత నిద్రపోయేలా చూడాలి. గంటసేపైనా బయట ఆడుకునేలా ప్రోత్సహించాలి. ఈ జాగ్రత్తలు పాటించడం మంచిది.

హెల్త్ టిప్స్



● కిస్మిస్‌లలో జింక్, కాల్షియం, విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి మనకు ఎంతగానో మేలు చేస్తాయి. రాత్రిపూట కొన్ని కిస్మిస్‌లను తిని గోరువెచ్చటి నీరు తాగితే మరుసటి రోజు ఉదయం విరేచనం సాఫీగా జరుగుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. దీంతో పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు. అలా కాకపోతే రాత్రి పూట కిస్మిస్‌లను నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం కూడా తినవచ్చు. ఎలా తిన్నా సమస్య నుంచి బయట పడతారు.

● బాదంపప్పులో ప్రోటీన్లు, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ ఇ, కాల్షియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటాయి. అందువల్ల బాదంపప్పును రోజూ తింటే పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు. ఇందుకు గాను బాదంపప్పును రాత్రి పూట నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయాన్నే పరగడుపునే వాటిని పొట్టు తీసి తినాలి. దీని వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు పోవడంతోపాటు మలబద్ధకం తగ్గుతుంది. పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు.

● జామపండ్లలో విటమిన్లు, మినరల్స్ అనేకం ఉంటాయి. ఇవి దంతాలు, చిగుళ్ల సమస్యలు, జీర్ణ సమస్యలను తగ్గిస్తాయి. జామ పండ్లను తినడం వల్ల తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మలబద్ధకం ఉండదు. అలాగే పైల్స్ కూడా తగ్గిపోతాయి. రోజూ రాత్రి భోజనం చేసిన తరువాత నిద్రకు ముందు ఒక జామ పండును తింటే ఈ ప్రయోజనం కలుగుతుంది. దీంతో రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

● రోజూ పరగడుపునే మూడు లేదా నాలుగు పచ్చి వెల్లుల్లి రెబ్బలను తీసుకుని పెనంపై వేసి వేయించి వాటిని అలాగే తినాలి. నేరుగా తినలేం అనుకుంటే తేనెతో కలిపి తీసుకోవచ్చు. దీని వల్ల జీర్ణ శక్తి పెరుగుతుంది. మెటబాలిజం మెరుగు పడుతుంది. గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. అజీర్ణం నుంచి బయట పడతారు. మలబద్ధకం తగ్గి పైల్స్ నుంచి విముక్తి పొందవచ్చు.

● జీర్ణ సమస్యలను తగ్గించడంలో బెల్లం అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ రాత్రి భోజనం అనంతరం చిన్న బెల్లం ముక్కను చప్పరిస్తూ తినాలి. దీంతో తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మరుసటి రోజు సుఖ విరేచనం అవుతుంది. క్రమం తప్పకుండా రోజూ రాత్రి బెల్లం తింటే పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు.

సినిమా

కన్నప్పకి బై బై



● విష్ణు మంచు, అక్షయ్ కుమార్

బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ 'కన్నప్ప'కి బై బై చెప్పారు. తన పాత్రకి సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేసిన ఆయనకి చిత్ర యూనిట్ వీడ్కోలు పలికింది. విష్ణు మంచు హీరోగా ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కన్నప్ప'. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్‌బాబు పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైన షెడ్యూల్‌లో అక్షయ్ కుమార్ జాయిన్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా తన సీన్లకు సంబంధించిన షూట్‌ను ఆయన పూర్తి చేశారు. ''అక్షయ్ కుమార్‌గారి నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఈ ప్రయాణం ఎంతో విలువైనది'' అని సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు విష్ణు మంచు. ''ధైర్యవంతుడైన యోధుడు, శివ భక్తుడైన కన్నప్ప కథతో ఈ చిత్రం అద్భుతంగా రూపొందుతోంది. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది'' అన్నారు మేకర్స్.



● నయనతార

ముంబైలో వేట్టయాన్



● అమితాబ్ బచ్చన్ ● రజనీకాంత్

ముంబైలో అమితాబ్ బచ్చన్‌ను కలిశారు వేట్టయాన్. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వేట్టయాన్' (వేటగాడు). అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా ఇతర లీడ్ రోల్స్‌లో దుషారా విజయన్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం ఇది. తాజాగా 'వేట్టయాన్' చిత్రీకరణ ముంబైలో ప్రారంభమైంది. రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. గతంలో హైదరాబాద్‌లో జరిగిన 'వేట్టయాన్' షూటింగ్ షెడ్యూల్‌లో రజనీ, అమితాబ్ కాంబినేషన్ సీన్స్ తీశారు. ఇప్పుడు ముంబైలో వీరిద్దరి కాంబినేషన్ సీన్స్‌ను తీస్తున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని టాక్.

వినోదాల పతంగ్



● ప్రీతి పగడాల

ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'పతంగ్'. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వం వహించారు. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్‌పై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను డైరెక్టర్ బుచ్చిబాబు సానా విడుదల చేశారు. ఈ సినిమా కాంటెస్ట్ విజేతలకు సిరిసిల్ల మాజీ ఎంపీ రాజయ్య బహుమతులు అందించారు. బుచ్చిబాబు సానా మాట్లాడుతూ– ''ఈ మూవీ కంటెంట్ చూస్తుంటే 'హ్యాపీడేస్' సినిమాలా ఘన విజయం సాధిస్తుందనిపిస్తోంది'' అన్నారు. ''తొలిసారి పతంగుల పోటీతో రాబోతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్''' అన్నారు ప్రణీత్ ప్రత్తిపాటి. ''వేసవిలో మా సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది'' అన్నారు సంపత్ మక. ప్రణవ్ కౌశిక్, ప్రీతి పగడాల, వంశీ పూజిత్, క్రియేటివ్ నిర్మాత నాని బండ్రెడ్డి పాల్గొన్నారు.

టాక్సిక్‌లో..?

యశ్

'టాక్సిక్' సినిమాలో నయనతార భాగం కానున్నారా? అంటే అవుననే టాక్ కన్నడ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. యశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్'. మలయాళ నటి–దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా కియారా అద్వానీ, శ్రుతీహాసన్ వంటి స్టార్స్ పేర్లు వినిపించాయి. అలాగే యశ్‌కు సోదరి పాత్రలో కరీనా కపూర్ నటిస్తారనే ప్రచారం జరిగింది. దీనికి తోడు తాను సౌత్ సినిమా అంగీకరించినట్లు ఆ మధ్య కరీనా స్వయంగా వెల్లడించారు. అది 'టాక్సిక్' సినిమానే అనే ప్రచారం సాగింది. అయితే తాజాగా షూటింగ్ కాల్షీట్స్ సర్దుబాటు చేయలేని కారణంగా ఈ ప్రాజెక్ట్ నుంచి కరీనా కపూర్ తప్పుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ ప్లేస్‌లో నయనతారను తీసుకోవాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. 2010లో ఉపేంద్ర నటించిన 'సూపర్' కన్నడలో నయనతారకు తొలి సినిమా. వార్తల్లో ఉన్న ప్రకారం నయనతార 'టాక్సిక్' సినిమా చేస్తే.. పద్నాలుగేళ్ల తర్వాత ఆమె కన్నడ సినిమా చేసినట్లవుతుంది.

లక్ష్మీ కటాక్షం ఫిక్స్



● 'లక్ష్మీ కటాక్షం' పోస్టర్

సాయికుమార్ లీడ్ రోల్‌లో సూర్య దర్శకత్వం వహించిన చిత్రం 'లక్ష్మీ కటాక్షం: ఫర్ ఓట్'. ఆమని, వినయ్, అరుణ్, దీప్తీ వర్మ, చరిష్మా శ్రీకర్, హరి ప్రసాద్, సాయికిరణ్ ఏడిద కీలక పాత్రల్లో నటించారు. యు. శ్రీనివాసుల రెడ్డి, బి. నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కె. పురుషోత్తం రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న రిలీజ్ కానుంది. ''పొలిటికల్ సెటైరికల్ డ్రామా, కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం ఇది. ఈ చిత్రంలో ఓటర్లే వారి ఓటుకు ఒక రేటు నిర్ణయించుకుని నాయకులని ముప్పు తిప్పలు పెట్టే సీన్లు ప్రేక్షకులను నవ్విస్తాయి'' అన్నారు మేకర్స్.

ఈ పురస్కారం నాకో గౌరవం



● మెరిల్ స్ట్రీప్

హాలీవుడ్ ప్రముఖ నటి మెరిల్ స్ట్రీప్ ఆనందంలో ఉన్నారు. ఈ నెల 14 నుంచి 25 వరకు ఫ్రాన్స్‌లో 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ చలన చిత్రోత్సవాల్లో ప్రతిష్ఠాత్మకమైన పామ్ డి ఓర్ గౌరవ పురస్కారానికి మెరిల్ స్ట్రీప్‌ను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఆమె ఆనందానికి కారణం ఇదే. ఈ ఏడాది మెరిల్ స్ట్రీప్‌కు, జపాన్‌కు చెందిన యానిమేషన్ 'స్టూడియో ఘిబ్లి' నిర్వాహకులకు, హాలీవుడ్ దర్శక–నిర్మాత జార్జ్ వాల్టన్ లూకాస్ జూనియర్ (స్టార్ వార్స్, ఇండియానా జోన్స్' ఫేమ్)కు పామ్ డి ఓర్ పురస్కారాన్ని అందజేస్తారు. ఈ సందర్భంగా మెరిల్ స్ట్రీప్ మాట్లాడుతూ – ''ఈ అవార్డుకు ఎంపిక కావడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. అంతర్జాతీయ నటీనటులు, ఫిల్మ్ మేకర్స్ భాగస్వామ్యులైన కాన్స్ వేదికగా నేను ఈ అవార్డును గెలుచుకోవడం అనేది ఫిల్మ్ మేకింగ్ రంగంలో నాకు దక్కిన ఓ అద్భుత విజయంగా భావిస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు. గతంలో హాలీవుడ్ స్టార్స్ టామ్ క్రూజ్, మైఖేల్ డగ్లస్, హారిసన్ ఫోర్డ్ వంటివారికి పామ్ డీ ఓర్ అవార్డు దక్కింది.

ఎమోషనల్ సత్య

సమాజంలో తన వల్ల తన తల్లిదండ్రులకు ఏ మాత్రం ఇబ్బంది కలగకూడదని ఆలోచించే ఓ కొడుకు కథతో రూపొందిన చిత్రం 'సత్య'. హమరేశ్, ప్రార్థనా సందీప్ జంటగా నటించిన ఈ చిత్రానికి వాలీ మోహన్‌దాస్ దర్శకుడు. శివమ్ మీడియా పతాకంపై శివ మల్లాల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా వాలి మాట్లాడుతూ– ''సత్య' సినిమా హిట్ అయి, యూనిట్‌కి మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''ఈ సినిమా సెన్సార్ పూర్తయింది. ఈ నెల 10న తెలుగు రాష్ట్రాల్లో భారీ స్థాయిలో సినిమాను విడుదల చేయనున్నాం'' అన్నారు శివ మల్లాల.



● హమరేశ్, ప్రార్థన

1980లో ఏం జరిగింది?



● రాకేష్ వర్రె

'ఉయ్యాలా జంపాలా, మజ్ను' చిత్రాల ఫేమ్ విరించి వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. రాకేష్ వర్రె హీరోగా నటించారు. వైశాలీ రాజ్, రియా సుమన్, ఛత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవి ప్రకాశ్ ఇతర పాత్రల్లో నటించారు. ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా విరించి వర్మ మాట్లాడుతూ– ''1980లో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా పొలిటికల్ డ్రామాగా ఈ సినిమాను రూపొందించాం. ప్రేమకథలు దర్శకత్వం వహించిన నేను 'జితేందర్ రెడ్డి' లాంటి యాక్షన్ మూవీ చేయడంతో క్రేజ్ నెలకొంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వీఎస్ జ్ఞాన శేఖర్, సంగీతం: గోపీ సుందర్.

సూపర్ డీలక్స్...



● అషు రెడ్డి

'బిగ్ బాస్' ఫేమ్ అషు రెడ్డి, చాందినీ చౌదరి, వశిష్ఠ సింహా, జై భారత్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'యేవమ్'. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నవదీప్, పవన్ గోపరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో హారిక పాత్ర చేస్తున్న అషు రెడ్డి లుక్‌ను విడుదల చేశారు. ''మహిళా సాధికారతను చాటి చెప్పే నేపథ్యంలో 'యేవమ్' ఉంటుంది. నా బాడీ సూపర్ డీలక్స్ అని అషు రెడ్డి కిక్ ఇచ్చే పాత్రలో ఎందుకు కనిపించబోతున్నారో తెలియాలంటే 'యేవమ్' విడుదల వరకు ఆగాల్సిందే. కొత్త కథతో వైవిధ్యమైన నరేషన్‌తో ఈ సినిమా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

ఏమయ్యిందే...



● అశోక్ గల్లా, మానస

అశోక్ గల్లా, వారణాసి మానస జంటగా నటిస్తున్న చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకుడు. 'హనుమాన్' మూవీ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ కథ అందించారు. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'ఏమయ్యిందే..' అంటూ సాగే తొలి పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. సురేష్ గంగుల రాసిన ఈ పాటని ఈశ్వర్ దాతు పాడారు.